మిర్చి రైతులకు తీరని నష్టం

- ఆశించిన తెగుళ్లు, కుచ్చుముడత, నల్ల తామర పురుగు ఉధృతి
- నిలవని పూత, కాత
- మందులు కొట్టినా కానరిని ప్రయోజనం
- పంటను తొలగిస్తున్న రైతులు
- ఎకరాకు రూ. లక్షకు పైగా నష్టం
- ఆందోళనలో రామన్నగూడెం రైతులు


రామన్నగూడెంలో రోటోవేటర్‌తో మిర్చి తోటను తొలగిస్తున్న రైతు
ఇన్‌సెట్‌లో (తెగుళ్లు సోకిన మిర్చి పంట)

రఘునాథపల్లి: ఆరుగాలం శ్రమించిన అన్నదాతకు తీరని నష్టం. రెక్కల కష్టం .. రూ.లక్షల పెట్టుబడి పెట్టినా పంట చేతికందక తిప్పలు.. విదేశీయులు సైతం వచ్చి కొనుగోలు చేసే ఆ పంట ఇప్పుడు అర్ధాంతరంగా తొలగిస్తున్న దుస్థితి. తెగుళ్ల సోకడంతో ఎన్ని మందులు కొట్టినా చేతికి రాకపోవడంతో రైతులు ఆశలు వదులుకున్నారు. ఇది మండలం రామన్నగూడెంలో మిర్చి పంట దుస్థితి. రామన్నగూడెంలో ప్రధాన వాణిజ్య పంట మిర్చికి అంతర్జాతీయంగా డిమాండ్ ఉంది. నేల తల్లిని నమ్ముకున్న ఇక్కడి రైతులు దశాబ్దాలుగా మిర్చిని సాగు చేస్తుంటారు. నాణ్యతతో కూడిన ఇక్కడి మిర్చి కోసం విదేశీయులు సందర్శించి కొనుగోలు చేస్తుంటారు. ఈ ఏడాది దాదాపు 550 ఎకరాల్లో సాగు చేశారు. రెండేళ్లుగా మిర్చి పంటకు కుచ్చుముడత, నల్ల తామర పురుగు సోకడంతో పెట్టుబడి కోల్పోవాల్సి వచ్చింది. ఈ సారైనా తెగుళ్ల ఆశించవని.. ఎన్నో ఆశలతో సాగు చేసిన మిర్చికి మళ్లీ తెగుళ్ల సోకి పూత, కాత నిలవక పోవడంతో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది. తెగుళ్ల బారి నుంచి పంటను కాపాడుకోవడానికి అనేక రకాల మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. దీంతో కొందరు రైతులు చేసేది ఏమి లేక మిర్చి తోటలను రోటోవేటర్‌తో తొలగిస్తున్నారు. ఇప్పటికే గ్రామంలోని 50 శాతం రైతులు మిర్చి పంటను దున్నేశారు. ఎకరాకు రూ లక్షకు పైగా పెట్టుబడి పెట్టి నిండా మునిగామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేసిన అప్పులు ఎలా తీర్చాలోనని రైతులు తలల పట్టుకుంటున్నారు. .

గుంటూరు నుంచి విత్తనాలు

ప్రతీ ఏటా ఇక్కడి రైతులు గుంటూరుకు వెళ్లి విత్తనాలు కొనుగోలు చేసి సాగు చేస్తుంటారు. ప్రధాన కంపెనీలకు చెందిన విత్తనాలు సాగు చేసినా తోటలో కుచ్చుముడత, నల్ల తామర పురుగు విస్తరించి పూత, కాత నిలవక మాడిపోతోంది. తెగుళ్లు సోకాయని అధికారులకు ఫిర్యాదు చేసినా తోటలను సందర్శించేందుకు ఎవరూ రావడరం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయ శాస్త్రవేత్తలు తోటలను పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆరు ఎకరాల మిర్చి పంట తీసేసిన..



ఆరు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశా.. దసరా తర్వాత వచ్చిన వర్షాలతో పంటకు తెగుళ్లు సోకాయి. కుచ్చుముడత, తామర పురుగుతో పూత, కాత నిలవడం లేదు. ఎన్ని మందులు పిచికారి చేసినా ఫలితం లేదు. చేసేదేమి లేక ఆరు ఎకరాల పంట మొత్తం రోటవేటర్‌తో తొలగించా. మూడేళ్లుగా మిర్చి పంట సాగు చేసి నష్ట పోవాల్సివస్తోంది. ఈ సారైనా తెగుళ్ల ఆశించవని మిర్చి పంట చేశా. సాగు వ్యయం ఆరు ఎకరాలకు రూ.8 లక్షల ఖర్చయింది. నిండా మునిగాం.. నష్టపోయిన మిర్చి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

\- వాకిటి వెంకట్‌రెడ్డి, మిర్చి రైతు, రామన్నగూడెం

అధికారుల సూచనలు పాటించాలి



మిర్చి తోటలో ఆశించిన తెగుళ్లనివారణకు అధికారుల సూచనలు పాటించాలి. కీఫన్ పురుగు మందు త్రిప్స్ వంటి పీల్చే తెగుళ్లను నియంత్రిస్తుంది. లీటర్ నీటికి 1.5 నుంచి 2 మి.లీ కలిపి పిచికారి చేయాలి. అదే విదంగా అలాంటో లీటరు నీటికి 2 మి.లీ, బెనెవియా లీటరు నీటికి 2 మి, లీ, ఓషీన్ లీటరు నీటికి 0.4 గ్రాములు వెర్వేరుగా పంటపై పిచికారి చేసుకోవాలి.. తెగుళ్ల ఆశించిన మిర్చి తోటలను ఇటీవల పరిశీలించాం. తెగుళ్ల ఉధృతితో పూత, కాత లేకుండా రాలడంతో రైతులు మిర్చి పంటలను తొలగిస్తున్నారు. సమస్య ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా.

\- జి.ధీరజ్, హార్టికల్చరల్ అధికారి, స్టేషన్‌ఘన్‌పూర్

క్లుప్తంగా

డ్రైవర్ పోస్టుల భర్తీలో పారదర్శకత పాటించాలి

జనగామ: జనగామ మెడికల్ కళాశాలలో డ్రైవింగ్ పోస్టుల నియామకంలో పారదర్శకత పాటించాలని జనగామ మండలం అడవికేశ్వాపూర్‌కు చెందిన బానోత్ రాంకోటి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన ఈ విషయమై కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేసి మాట్లాడా రు. మెడికల్ కళాశాలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయగా, తాను అప్లై చేసుకున్నట్లు వివరించారు. ముందుగా విడుదలచేసిన ప్రొవిజనల్ లిస్టులో తన పేరు సీనియార్టీ ప్రకారం చూపించగా, ప్రస్తుతం వేసిన జాబితాలో అడిషినల్ పాయింట్లను కలిపి మరో వ్యక్తి పేరును ప్రస్తావించారన్నారు. కలెక్టర్ తనకు న్యాయం చేయాలని కోరారు.

శ్మశానవాటికను పునరుద్ధరించాలి

జనగామ రూరల్: పట్టణంలో 5వ వార్డు గోకుల్‌నగర్ ప్రాంత ప్రజలకు రంగప్ప చెరువు కింద శ్మశాన వాటికను పునరుద్ధరించి మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మెకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ఏఓ మన్సూరీకి వినతిపత్రం అందజేశారు. పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్, బూడిది గోపి, సుంచు విజేందర్, నరేందర్, కళ్యాణి, లలిత, లింగం పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు

జఫర్‌గఢ్: మండలంలోని రేగడితండా గ్రామ శివారు టీబీతండాకు చెందిన ధరమ్‌సోతు రాజా, లకావత్ హనుమంతు నాటు సారా రవాణ చేస్తుండగా పట్టుకున్నట్లు పాలకుర్తి ఎక్సైజ్ సీఐ సంతోష్‌రెడ్డి బుధవారం తెలిపారు. సాగరం క్రాస్ రోడ్డు తనిఖీ చేస్తుంగా వీరిని పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 11 లీటర్ల నాటు సారాతోపాటు రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ ఎస్సై కె పద్మ, సిబ్బంది నవీన్‌కుమార్, కుమారస్వామి, మహేష్, వెంకటేష్ ఉన్నారు.

1న దివ్యాంగ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

కొడకండ్ల: డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని గాంధీభవన్ సమీపంలోని ప్రకాశం హాల్‌లో దివ్యాంగుల ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జరుగుతుందని దివ్యాంగుల ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నరిగే కుమారస్వామి తెలిపారు. ఈ సమావేశానికి వివిధ శాఖల మంత్రులు, రాష్ట్ర దివ్యాంగుల చైర్మన్ ముత్తినేని వీరయ్యలు హాజరవుతున్నార న్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని దివ్యాంగుల ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సన్మానం



రఘునాథపల్లి: మండలంలోని పలు గ్రామాలకు చెందిన ఆరె కులస్తులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబును బుధవారం మండల కేంద్రంలో ఘనంగా సత్కరించారు. మండల కేంద్రంలోని రాంబాబు స్వగృహంలో ఆరె కుల మండల అధ్యక్షుడు నానాజీ అధ్యక్షతన కులస్తులు శాలువాలు, బోకేలతో సన్మానించారు. కంచనపల్లి పీఏసీఎస్ చైర్మన్ రవీందర్‌జీ, లోనె రవి, గవ్వాని నాగేశ్వర్‌రావు, గాజులపాటి మహేందర్, నానాజీ, వీరోజీ, మోర్తాల మహేందర్, గాజులపాటి మైసారావు, పేర్వారం సుధాకర్, మోహన్‌రావు, లోనె శ్రవణ్‌కుమార్, కిషన్‌రావు, శ్యాము, రమేష్, అజయ్, వెములయ్య, సోంమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌కు..

దేవరుప్పుల: మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా నియామకమైన నల్ల ఆండాలు శ్రీరాములు దంపతులను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు బుధవారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. అలాగే మండలంలోని కోల్కొండకు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్ల సత్యనారాయణ కొడకండ్ల వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేయగా బుధవారం గ్రంథాలయ శాఖ చైర్మన్ మారుజోడు రాంబాబు, విజయ డెయిరీ జిల్లా అధ్యక్షుడు కాసారపు ధర్మారెడ్డి తదితరులు పాల్గొని అభినందనలు తెలిపారు.

అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు

బచ్చన్నపేట: మండలంలోని కట్కూర్ గ్రామంలో మంగళవారం రాత్రి కారు–బైక్ ఢీకొని మృతి చెందిన ఎనుగుల కర్ణాకర్(34), దూసరి సాయిబాబ(36)ల అంత్యక్రియలు బుధవారం అశ్రునయనాల మధ్య జరిగాయి. ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు. వీరి ఇద్దరి వ్యవసాయ బావులు కూడా పక్క పక్కనే ఉన్నాయి. ఏ పని చేసినా ఇద్దరూ కలిసి చేసుకునేవారని, మరణంలో కూడా కలిసే చనిపోయారని కుటుంబ సభ్యులు రోదించారు. సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తరలించి బంధువులు, స్నేహితుల రోదనల మధ్య అంత్యక్రియలను నిర్వహించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

జనగామ: గ్రంథాలయాలు మనిషిలోని జ్ఞానాన్ని పెంపొందించేందుకు ఉపయోగపడతాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకుని బుధవారం జిల్లా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వారోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ఎమ్మెల్యే బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య, కౌన్సిలర్ గుర్రం భూలక్ష్మినాగరాజు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎడవెల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి ఎం.సుధీర్, కౌన్సిలర్లు స్వరూప, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.


విజేతలతో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

అధిక సాంద్రత పత్తిసాగు మేలు


తరిగొప్పుల: క్షేత్ర దినోత్సవంలో శాస్త్రవేత్త తదితరులు


జఫర్‌గఢ్: క్షేత్ర స్థాయి పర్యటనలో విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీకాంత్

తరిగొప్పుల: అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని, తద్వారా రైతులకు అధిక రాబడి వస్తుందని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి. అనిల్ కుమార్ అన్నారు. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం భువనగిరి జిల్లా అధ్వర్యంలో బుధవారం మండలంలోని మాన్‌సింగ్ తండాలో అధిక సాంద్రత పత్తి సాగు, క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌డీపీఎస్ పత్తి సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మధుశేఖర్, ఏఓ పెబెట్టి మనోహిత్ విక్రమ్‌రావ్, యంగ్ ప్రొఫెషనల్ వేణు, రుపా, విజయకాంత్, దేష్పాండే సంస్థ ప్రతినిధులు పరుశరాములు, రజని, అభ్యుదయ రైతులు కాయిత సంపత్, లింగయ్య, యాదయ్య పాల్గొన్నారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన

జఫర్‌గఢ్: మండల కేంద్రంలో ఉన్న ఆదర్శ పాఠశాలకు చెందిన ఒకేషనల్ విభాగానికి చెందిన విద్యార్థులు బ్యూటీ అండ్ వెల్నెస్ టీచర్ మమత ఆధ్వర్యంలో స్టేషన్‌ఘన్‌పూర్‌లోని బ్యూటీ పార్లర్‌కి క్షేత్ర స్థాయి పర్యటనకు బుధవారం వేళ్లారు. ఈ కార్యక్రమాన్ని ముందుగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పర్యటన ద్వారా విద్యార్థులు కొత్త విషయాలు తెలుసుకునేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్‌లో విద్యార్థులు స్వయం ఉపాధి పొందేందుకు అవకాశం లభిస్తుందన్నారు. విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

కొడకండ్ల : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన మార్కెట్ పాలకవర్గం రైతు సంక్షేమమే రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో నిర్వహించిన నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. మార్కెట్‌లో మౌలిక వసతుల కల్పన, రైతు సమస్యల పరిష్కారానికి పాలకవర్గం కృషి చేయాలని, ఇందుకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసే వారికి తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. చైర్‌పర్సన్ నల్ల ఆండాలు, వైస్ చైర్మన్ ఈరంటి సాయి, డైరెక్టర్లు దేశగాని నాగరాజు, వలబోజు రమేష్, బత్తుల వెంకన్న, వనం మోహన్, నారెడ్డి వెంకట్‌రెడ్డి, నామాల ఈదయ్య, నల్ల సత్య నారాయణ, కుందూరు మధన్‌మోహన్‌రెడ్డి, ముత్యాల పూర్ణచందర్, భానోత్ యాకూబ్, గిరగాని క్రాంతికుమార్‌గౌడ్, సత్యానారాయణ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి, లక్ష్మీనారాయణనాయక్, ప్రవీణ్‌కుమార్, నెహ్రూనాయక్ పాల్గొన్నారు.

కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా..

దేవరుప్పుల: కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సీతారాంపురం గ్రామానికి చెందిన దొంతి రవి అనారోగ్యానికి గురై హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. చికిత్స నిమిత్తం రూ.5లక్షలు కావాల్సి ఉంది. కాగా, బుధవారం సీతారాంపురం కాంగ్రెస్ పార్టీ నాయకుల సూచన మేరకు రవి కుమార్తె స్వాతిని ఎమ్మెల్యేను కలువగా వెంటనే స్పందించి ట్రీట్మెంట్‌కు రూ.50వేల ఎల్‌ఓసీని అందజేసింది. ఈ సందర్భంగా రవి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే యశస్వినిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

యాంటీబయోటిక్స్ సరైన మోతాదులో వాడాలి


మాట్లాడుతున్న సుధీర్

స్టేషన్‌ఘన్‌పూర్: యాంటీబయోటిక్ మందులను వైద్యుల సూచనల మేరకు సరైన మోతాదులోనే వినియోగించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్ అన్నారు. వరల్డ్ యాంటీబయోటిక్స్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్రజలు ఆరోగ్యపరంగా ఏ సమస్యలున్నా వైద్యులను సంప్రదించాలని, వైద్యుల సూచనల మేరకే యాంటీబయోటిక్స్‌ను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ వీరాంజనేయులు, ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ సంధ్య, వైద్యులు డాక్టర్ సునీత, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ జనార్దన్, డాక్టర్ అజయ్‌కుమార్, డాక్టర్ సంధ్య, సీహెచ్‌ఓ వెంకటస్వామి, డీపీఎంఓ మురహరి తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బచ్చన్నపేట: మండల కేంద్రంలో కర్రె శ్రీకాంత్ ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి బుధవారం పరామర్శిం ప్రగాఢ సానుభూతి తెలిపి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు ఉన్నారు.

కొన్నెలో..

కొన్నెలో అచ్చిన బీరయ్య మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ బుధవారం పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఐలయ్య, నర్సయ్య, భిక్షపతి, శ్రీను, శ్రీశైలం ఉన్నారు.

వడిచర్లలో..

లింగాఘణపురం: మండలంలోని వడిచర్లకు చెందిన లింగాల కృష్ణమూర్తి మృతి చెందగా బుధవారం ఆ కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో ఏర్పాటు చేసిన సోషల్ ప్లాట్‌ఫాం సభ్యులు రూ.62,600లు ఆర్థిక సహాయం అందజేశారు. కడు నిరుపేదలైన ఆ కుటుంబానికి సహాయం చేసేందుకు గ్రామస్తులంతా ముందుకు వచ్చి ఆర్థిక సహాయంతో చేయూత నిచ్చిన వారిని గ్రామస్తులు అభినందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.


లింగాలఘణపురం: ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు, గ్రామస్తులు

పల్లగుట్టలో..

చిల్పూరు: మండలంలోని పల్లగుట్ట గ్రామానికి చెందిన నాగిళ్ల రాజు అనారోగ్యంతో మృతి చెందాడు. పేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న చిల్పూరు ఆలయ శాశ్వత అభివృద్ధి దాత పొట్లపల్లి శ్రీధర్‌రావు రూ. 10 వేలు పంపగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు తదితరులు మృతుడి భార్య సుజాతకు అందజేశారు. డాక్టర్ రత్నాకర్‌రెడ్డి, వెంకట్రాజం, కుంచాల సంపత్‌రాజు, శ్యాంసుందర్, కొంతం బాబన్న, గుర్రం యాదగిరి, జీడి ఆనందం, కిట్టు, జయప్రకాష్, దార అశోక్‌పాల్ ఉన్నారు.

ఉపాధ్యాయులపై కలెక్టర్‌కు ఫిర్యాదు



రఘునాథపల్లి: రఘునాథపల్లి స్టేషన్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో తరగతి గదులు శుభ్రం చేయించారని, వారితో చెత్త, సామగ్రి మోయించారని గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఠాకూర్ గణేష్‌సింగ్ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పిల్లలకు చదువు చెప్పకుండా స్కూల్‌లో పనులు చేయించడం సమంజసం కాద ని, ఈ విషయంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లాలోని ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక పోవడం వల్లే పాఠశాలల్లో విద్యార్థులను బానిసల్లా మారుస్తున్నారన్నారు. పాఠశాలలో ఆడ పిల్లలకు విడిగా బాత్రూం కట్టించాల్సి ఉండగా, బాలురు, బాలికలకు పక్క పక్కనే నిర్మించారని ఆరోపించారు. కలెక్టర్ కార్యాలయంలో ఏఓ మన్సూరికి వినతి పత్రం ఇవ్వగా సానుకూలంగా స్పందించారని ఠాకూర్ గణేషసింగ్ తెలిపారు.

హక్కులపై అవగాహన అవసరం

స్టేషన్‌ఘన్‌పూర్: బాలబాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని జీసీడీఓ గౌసియా బేగం అన్నారు. మండలంలోని నమిలిగొండ శివారు కేజీబీవీలో బాలికా సాధికారత క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ చిల్డ్రన్స్ డే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జీసీడీఓ మాట్లాడారు. బాల బాలికలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు బాధ్యతలను గుర్తించి ముందుకు సాగాలన్నారు. సైబర్‌నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు మొబైల్ ఫోన్‌లను వినియోగించవద్దని, అనవసర లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఓపెన్‌చేయవద్దని సూచించారు. పిల్లలు తమ హక్కులపై అవగాహన పెంచుకోవడంతో పాటు ఏమైనా సమస్యలుంటే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో డీహెచ్ ఈడబ్ల్యు శారద, నాగరాజు, స్పెషల్ ఆఫీసర్ రజిత తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో జీసీడీఓ గౌసియాబేగం తదితరులు

సమాజంపై అవగాహన ఉండాలి

ప్రస్తుత సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సీఐ జి.వేణు అన్నారు. శివునిపల్లి శివారులో ఉన్న ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐ మాట్లాడారు. ఎస్ఐ వినయ్, హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయండి

చిల్పూరు: తెలంగాణ భవన నిర్మాణ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని భవన నిర్మాన కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని వంగాలపల్లి–కరుణాపురం బస్ స్టేజీ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ధార్నా నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిన్నారపు మహేందర్, కొంరయ్య, జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. కాగా, ధర్నా విషయం తెలుసుకున్న స్టేషన్‌ఘన్‌పూర్ సీఐ వేణు, ఎస్సై బొల్లం వినయ్‌కుమార్, చిల్పూరు ఏఎస్సై జయకుమార్ బందోబస్తు నిర్వహించారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

జఫర్‌గఢ్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ కిషన్‌నాయక్‌కు అందజేశారు. రైతు సంఘం మండల అధ్యక్షుడు నీరటి కొమురయ్య, ఎర్ర రవి, బొడ్డు సమ్మయ్య, పిన్నింటి సమ్మయ్య, బంగారు చిరంజీవి ఉన్నారు.

ఆరు గ్యారంటీలకు బదులు ఐదు ఉచితంగా అందించండి

జనగామ రూరల్: రాష్ట్రంలో పేదలకు ఆరు గ్యారంటీలకు బదులు 5 ఉచితాలు అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి మహారాజ్ అన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని పేదలందరికీ ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఒక ఎకరం సాగు భూమి, నాలుగు గదుల ఇల్లు అంద జేయాలని అన్నారు. కిష్టయ్య మహారాజ్. బాబు మహారాజ్. రవి మహారాజ్. ఉమా మహారాణి ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

మద్దతు ధర ప్రకటించాలి

బచ్చన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతలు కష్టపడి పండిస్తున్న పంటలకు మద్దతు ధరను ప్రకటించాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శులు అన్నెబోయిన రాజు, తాడెం రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయం ఎదుట నాయకులు నిరసన తెలిపారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు. గుండా రవి, కుమార్, నాగరాజు, ఇంద్ర, సునీత, ఎల్లమ్మ పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలని వినతి

జనగామ రూరల్: కరెన్సీపై అంబేడ్కర్ ఫోటో ముద్రించాలని ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జెరిపోతుల పరశురామ్ కోరారు. ఈ మేరకు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.పీతంకు బుధవారం వినతి పత్రం అందజేశారు. సిద్దులు, సంజీవ, శ్రీను, నాగరాజు, ప్రసాద్, పాల్గొన్నారు.

చుక్కా రామయ్యను కలిసిన ఎర్రబెల్లి

పాలకుర్తి టౌన్: ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య జనమ్మదినం సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయార్‌రావు కలిసి శుభకాంక్షలు తెలిపారు. ఐఏఎస్ అధికారి బుర్ర వెంకటేశ్వర్లు, రవీందర్‌రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన గ్రంథాలయాల సంస్థ చైర్మన్

రఘునాథపల్లి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు బుధవారం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. గ్రంథాలయ చైర్మన్ నియామానికి సహకరించడం పట్ల ఎమ్మెల్యేకు శాలువా, బొకే అందజేసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రవీందర్‌జీ, శ్రవణ్‌కుమార్ ఉన్నారు.

బెల్ట్ షాపులు ఎత్తేయాలి

జనగామ రూరల్: జిల్లాలో బెల్ట్ షాపులను తక్షణమే ఎత్తివేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య డిమాండ్ చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి పందిళ్ళ కళ్యాణి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో విచ్చల విడిగా కిరాణా షాపులు, హోటళ్లు, ఇళ్లలో మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఎక్సైజ్ అధికారులు వీటిని నియంత్రించకుండా చోద్యం చూస్తున్నారన్నారు. బెల్టు షాపులను ఎత్తివేయాలని ఎక్సైజ్ అధికారులను కోరారు. భవాని, రమాదేవి, శ్రీలత, అనిత, అంజమ్మ పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ మండలాన్ని హనుమకొండ జిల్లాలో చేర్చాలి

జఫర్‌గఢ్: జఫర్‌గఢ్ మండలాన్ని హనుమకొండ జిల్లాలో చేర్చాలని జేఏసీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక అర్యవైశ్య భవనంలో జేఏసీ మండల కన్వీనర్ బానోత్ రాజేష్‌నాయక్ అధ్యక్షతన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రతినిధులు మాట్లాడారు. జఫర్‌గఢ్ మండలాన్ని జనగామ జిల్లాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ నాడు జేఏసీ ఆధ్వర్యంలో వంద రోజులు పోరాటం చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా జిల్లాలు, మండలాల విభజన చేపట్టడం జరిగిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి మండల ప్రజల అభిప్రాయం మేరకు జఫర్‌గఢ్ మండలాన్ని హనుమకొండ జిల్లాలో చేర్చాలన్నారు. అలాగే జేఏసీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని కోరారు.

రైలు ఢీకొని గొర్రెల కాపరి, పది గొర్రెలు మృతి

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని కూలీ దేవసాని నర్సయ్య(58)తో పాటు పది గొర్రెలు అక్కడికక్కడే మృతిచెందిన సంఘటన మండలంలోని రాఘవాపూర్‌లో రైల్వేగేటు వద్ద మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామానికి చెందిన నర్సయ్య కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అదేగ్రామానికి చెందిన పెరబోయిన రాజుయాదవ్, పులిగిళ్ళ సోమయ్యయాదవ్ తాము శుభకార్యానికి వెళ్తున్నామని, ఒక్కరోజు కూలీగా తమ గొర్రెలను మేపాలని నర్సయ్యకు చెప్పారు. దానికి అంగీకరించిన నర్సయ్య మంగళవారం గొర్రెలను తోలుకుని రాఘవాపూర్‌లో రైల్వే ట్రాక్ వైపు వచ్చాడు. గొర్రెలను ట్రాక్ దాటిస్తుండగా రాఘవాపూర్ ఎల్‌సీ గేట్ వద్ద గుర్తు తెలియని రైలు వేగంగా సికింద్రాబాద్ నుంచి కాజీపేట వైపు దూసుకొచ్చింది. ఈ క్రమంలో నర్సయ్య గమనించి పక్కకు జరిగినా మృత్యువు వెంటాడింది. రైలు పక్కగా తగలడంతో ఎగిరి పక్కనే ఉన్న విద్యుత్‌పోల్‌కు తగిలి మోరీలో పడి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతిచెందాడు. అదేవిధంగా అతడు మేపుతున్న గొర్రెలలో పది గొర్రెలు రైలు ఢీకొని మృత్యువాత పడ్డాయి. కాగా, స్థానికులు అందించిన సమాచారం మేరకు జనగామ జీఆర్‌పీ హెచ్‌సీ రమణారెడ్డి, పీసీ నరేశ్, ఆర్‌పీఎఫ్ ఎస్సై రాజన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. శవ పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడు నర్సయ్యకు భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు. మృతుడి భార్య కోమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్‌పీ పోలీసులు తెలిపారు.


మృతిచెందిన గొర్రెలు


నర్సయ్య (ఫైల్)

రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయాలి

రఘునాథపల్లి: వరదలతో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు పనులు సత్వరం పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. బుధవారం మండలంలోని కోమల్ల– కంచనపల్లి, ఖిలాషాపూర్ –జాఫర్‌గూడెంలో కొనసాగుతున్న రోడ్ల మరమ్మతు పనులను ఆయన పరిశీలించారు. మరమ్మతు పనుల్లో వేగం పెంచాలని, గ్రావెలింగ్‌తో సరైన విధంగా నింపి, దానిపై రోడ్డును పటిష్టంగా నిర్మించాలని సూచించారు. రోడ్లకు ఇరువైపులా ఉన్న పొదలు, కంప చెట్లు, పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించాలని ఆయన ఆదేశించారు. ఆయన వెంట పీఆర్ ఈఈ శ్రీనివాసరావు, ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న పింకేష్‌కుమార్